క్లుప్తంగా

'స్వచ్ఛ సర్వేక్షణ్' అవగాహన సదస్సు



నకరికల్లు: గ్రామాల్లో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డిని వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 కార్యక్రమంపై అన్నిగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీని పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఓడీఎఫ్ ప్లస్ గ్రామంలో చెత్త కుప్పలు లేకుండా, మురుగుకాలువల్లో నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు. ఇళ్లల్లోని వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా క్లాప్ మిత్రలకు ఇచ్చి సహకరించాలని అన్నారు. ఘన వ్యర్థాల నిర్ధారణ, మురుగునీటి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. ఈఓపీఆర్డీ గిరిధర్, మండల కో–ఆర్డినేటర్ సీహెచ్ పుల్లారావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: పంచారామంలోని ప్రథమ పంచారామమైన బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామికి గురువారం వర్ల కేశ్వరరావు దంపతులచే లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు అర్చకస్వాములు నిర్వహించారు. శుక్రవారం ఆర్జిత సేవలలో భాగంగా శంకరమంచి చంద్రశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో జ్వాలాముఖి అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త రాజావాసిరెడ్డి మురళీ కృష్ణ ప్రసాద్ తెలిపారు. భక్తులు వేలాదిగా కుంకుమార్చనలో పాల్గొనాలని కోరారు.

బొల్లవరంలో'ఫ్యామిలీ డాక్టర్'



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు జయకృష్ణ పాల్గొని 86 మందికి వైద్యసేవలందించారు. 70 మందికి సాధారణ వైద్యపరీక్షలు, 9 మందికి బీపీ పరీక్షలు, ఏడుగురికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి అవసరమైన వైద్యసేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ పి.కమల, ఏఎన్‌ఎం అనురాధ, ఎంపీహెచ్‌ఏ మస్తాన్‌రావు, ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

బెల్లంకొండ: విద్యుత్ షాక్ కొట్టడంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో గురువారం రాత్రి 9 గంటల సమయంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాణావతు రత్నీబాయి(30) మృతి చెందినట్లు తెలిపారు. రత్నీబాయి భర్త రమణా నాయక్ రెండేళ్ల క్రితం కరోనా బారినపడి మృతి చెందాడు. దీంతో 12 ఏళ్ల లోపు ఉన్న తన ఇద్దరు మగ పిల్లలతో కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో రోజూమాదిరిగా ఉదయాన్నే కూలి పనులకు వెళ్లాలని రాత్రి సమయంలోనే బట్టలు ఉతికి ఇంట్లో ఉన్న ఇనుప తీగపై ఆరేస్తుంది. ఈ క్రమంలో ఇనుప తీగకు విద్యుత్ ప్రవహించడంతో షాక్ కొట్టింది. దాదాపుగా పది నిమిషాల తర్వాత గమనించిన స్థానికులు వెంటనే కాపాడే ప్రయత్నం చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న మహిళను ఆటోలో వైద్యశాలకు తరలించేలోగా మృతి చెందిందని తెలిపారు.

మణిపూర్ మారణకాండను నియంత్రించాలి

చిలకలూరిపేట: మణిపూర్ మారణకాండను అడ్డుకొనేందుకు కేంద్రప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని, అక్కడ శాంతి నెలకొల్పేందుకు కృషి చేయాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులు కోరారు. క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మండలంలోని కుక్కపల్లివారిపాలెం గ్రామంలో మణిపూర్ అల్లర్లను నిరసిస్తూ గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సమాజం సిగ్గుతో తలవంచుకొనేలా మణిపూర్ మారణకాండ కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ పల్నాడు జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు రెవరెండ్ ఎంవీఎల్ పావని, చేబ్రోలు మాణిక్యాలరావు, బి.సుబ్బారావు, ఎన్.అబ్రహం, పి.తిమోతి, ఎం.మోషే పాల్గొన్నారు.

ఆదర్శ శిఖరం అబ్దుల్ కలాం

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంకు వాడవాడలా ఘననివాళి



రెంటపాళ్లలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు

సత్తెనపల్లి: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ భారతరత్న అబ్దుల్ కలాం ఆదర్శశిఖరమన్నారు. ఆయన ప్రతి మాటా ప్రేరణాత్మకమేనన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో ఉత్తమ మార్కులు తెచ్చుకొని ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించిన సముద్రాల వైష్ణవిని ఘనంగా సత్కరించి, రూ.5వేలు నగదు బహుమతి అందజేసి, అభినందించారు. కోఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరావు నాయక్, సత్తెనపల్లి మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివ ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో...

మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో గురువారం శ్రీసరస్వతీ శిశుమందిర్ లో కలామ్ చిత్రపటానికి, రైల్వేస్టేషన్ రోడ్ లోని డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలార్పణ చేశారు. అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీదర్, ఉపాధ్యక్షులు పుట్టి సాంబశివరావు, సంస్థ కోశాధికారి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జీపీఎస్.శాస్త్రీ, యోగా సాధకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ×సత్తెనపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్‌రోడ్డు లో గల అబ్దుల్ కలాం విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంచికంటి వేంకటేశ్వర రావు, కార్యదర్శి వల్లూరి శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు కంబాల వేంకటేశ్వరరావు, పెద్దింటి చంద్రయ్య పాల్గొన్నారు.



అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పించి, విద్యార్థినిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రెంటపాళ్ళ గ్రామంలో...

సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పాఠశాల విద్యార్థులతో నివాళులర్పించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మొక్కపాటి రామచంద్రరావు, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, శ్రీను, చిన్నారులు పాల్గొన్నారు.

చింతపల్లి ప్రాథమిక పాఠశాలలో..

అచ్చంపేట: భారత రాష్ట్రపతి స్వర్గీయ అబ్దుల్‌కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని చింతపల్లి ఎంపీ ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్‌కలాం 8వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కలాం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రపతిగా, భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్తగా, రాజనీతిజ్ఞుడిగా కలాంచేసిన సేవలు ఎనలేనివన్నారు. ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, ముస్లిం యూత్ సభ్యులు బాలసైదా, జాన్‌సైదా, బాబావలి, తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నూర్‌బాషా సంఘం నాయకులు

ఏపీజే అబ్దుల్‌కలాం చిరస్మరణీయుడు

నకరికల్లు: భారతావనికి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టిన మిస్సైల్‌మాన్, భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చిరస్మరణీయుడని నూర్‌బాషా సంఘం నాయకుడు దూదేకుల బాషా అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతిని నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం అణుబాంబు తయారుచేసి దేశప్రతిష్టను ప్రపంచదేశాలకు చాటారని కొనియాడారు. దివ్యాంగుల కోసం తక్కువ బరువు గల కాలిపర్స్, గుండెకు ఏర్పాటు చేసే స్టంట్‌పరికరాన్ని తక్కువ ఖర్చులో అందుబాటులోకి తెచ్చిన మనసున్న గొప్ప శాస్త్రవేత్తగా నిలిచారన్నారు. రాష్ట్రపతిగా పనిచేసిన కాలంలో అందరివాడిగా ఖ్యాతినార్జించిన ఘనుడు అబ్దుల్‌కలాం అని అన్నారు. కార్యక్రమంలో నూర్‌బాషా సంఘం నాయకులు షేక్ నాగుల్‌మీరా, బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి కొనసాగుతున్న చేరికలు

అచ్చంపేట: మండలంలోని చిగురుపాడు నుంచి భారీగా కుటుంబాల సమేతంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. చిగురుపాడు చెందిన 11 కుటుంబాల టీడీపీ, జనసేన కార్యకర్తలు బుధవారం రాత్రి గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి తరలివెళ్లి ఎమ్మెల్యే నంబూరు శంకరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రెండు రోజుల క్రితమే ఇదే గ్రామం నుంచి 10కుటుంబాలవారు చేరారు. అంతకు ముందు 8 కుటుంబాలవారు చేరారు. ఈ వారంలో మొత్తం 30కుటుంబాలకు చెందిన సుమారు 100మందికిపైగా ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీ, జనసేన, ఇతర పార్టీల వారికి సైతం అందుతున్న సంక్షేమ పథకాలపట్ల ఆకర్షితులవుతున్న అనేకమంది స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. పార్టీలో చేరిన వారిలో బీసీ వర్గానికి చెందిన ఎనుముల ఆంజనేయులు, ఎనుముల మారుతి, వేముల రామాంజనేయులు, ఎనుముల నరసింహారావు, ఆరుద్ర ఐతంంజు, గోపు శ్రీను, ఎస్టీ వర్గానికి చెందిన కుంభా గోవిందం, కుంభా ఏడుకొండలు, ఉల్లిగడ్డల శ్రీను, మేడా చిన్ననాగయ్య, కుంభా శ్రీనివాసరావు ఉన్నారు.



ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో పార్టీలో చేరిన చిగురుపాడు టీడీపీ నాయకులు

జీవన నైపుణ్యాలపై అవగాహన

దొడ్లేరు(క్రోసూరు) : మండలంలోని దొడ్లేరు జెడ్పీపాఠశాలలో గురువారం గుడ్‌షెపర్డ్స్ స్వచ్ఛంద సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసి ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాల గురించి కిషోరబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇచ్చిన 10 జీవన నైపుణ్యాల గురించి వివరించారు. స్వీయ అవగాహన, నిర్ణయాలు తీసుకోవటం, సమస్య పరిష్కారం, సృజనాత్మక ఆలోచన, క్లిష్ట పరిస్థితిలో ఆలోచన, సహాయసుభూతి, వ్యక్తులమధ్య సత్సంబంధాలు, లక్ష్యాన్ని ఎంచుకోవటం, ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగాల నియంత్రణ, అంశాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి చిల్కా బాబూరావు అధ్యక్షత వహించారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, బాలికలు, గుడ్‌షెపర్డ్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సత్తెనపల్లి: పట్టణ ప్రజలకు భవిష్యత్తులో మంచినీటి సమస్య తలెత్తకుండా చెరువుకు పూర్తిస్థాయిలో సాగర్ జలాలు నింపాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని గార్లపాడు రోడ్‌లో గల మంచినీటి చెరువుకు సాగర్ జలాలు నింపటాన్ని గురువారం ఆయన పరిశీలించారు. సాగర్ జలాలను కాలువల ద్వారా 8 విద్యుత్ హెవీ మోటార్ల పైపుల సాయంతో చెరువులోకి నీటిని నింపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ సాగర్ జలాలు వచ్చినన్ని రోజులు చెరువులోకి నీటిని మళ్లించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. చెరువు మొత్తం నీటితో నిండితే పట్టణ ప్రజలకు ఎలాంటి మంచినీటి సమస్య ఉత్పన్నం కాదన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, నాయకులు సెగ్గెం వెంకటేశ్వరరావు, పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), చెంచి రెడ్డి, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీందర్ రత్నాకర్

సత్తెనపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీందర్ రత్నాకర్ అన్నారు. ఏపీ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఆదేశానుసారం డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులు, డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా బాలికలకు అవగాహన సదస్సు, దోమలు, లార్వా ఎలా వృద్ధి చెందుతాయి గంబూషియా చేపల ద్వారా లార్వాను భుజించు విధానంపై విద్యార్థినులకు ఎగ్జిబిషన్ ద్వారా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీందర్ రత్నాకర్ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు గుడ్డు, లార్వా, ప్యూపా ఈ మూడు దశలు నీటిలోనే ఏడు రోజులు నుంచి పది రోజుల్లోపు పెద్దదోమగా తయారవుతుందని చెప్పారు. అందువలన నీటి నిల్వలు ఇంటి లోపల, బయట లేకుండా చూడాలని, నీటి నిల్వలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులైన టైఫాయిడ్, డయేరియా వర్షాకాలంలో వ్యాప్తి చెందుతాయని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, బయట పదార్థాలు తీసుకోరాదన్నారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే ప్రభుత్వ వైద్యశాలను కానీ పట్టణ ఆరోగ్య కేంద్రాలకు కానీ వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షల కిట్లు సిద్ధంగా ఉన్నాయని, రక్త పరీక్షలు అన్నీ ఉచితంగా చేస్తారన్నారు. అన్ని రకాల మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయన్నారు. సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ పార్థసారథి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నల్లబోతు సత్యవతి మాట్లాడారు. సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ హెల్త్ సూపర్వైజర్లు బి.రోశయ్య, వై.రాజేష్ పాల్, హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ కిరణ్‌బాబు, ఎస్‌ఎం హుస్సేన్, షేక్ షరీఫ్, సైన్స్ ఉపాధ్యాయురాలు వాసంతి, హెల్త్ సెక్రటరీ బి.పుణ్యవతి, శానిటరీ సెక్రటరీ ప్రదీప్, ఆరోగ్య కార్యకర్త ప్రియాంక, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దోమల ఉత్పత్తిపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న రవీందర్ రత్నాకర్

రేమిడిచర్లలో భూముల పరిశీలన

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామ పరిధిలోని భూములను నరసరావుపేట ఆర్డీవో ఎం. శేషిరెడ్డి గురువారం పరిశీలించారు. వివాదాస్పద భూములను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వి. సుధాకర్ శర్మ, మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావులను భూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేగ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీలు తమ భూములు దురాక్రమణకు గురయ్యాయని కొంత మందికి భూములను కౌలుకు ఇస్తే వాటిపై అజమాయిషీ చెలాయిస్తూ, పట్టాదారు పాస్ పుస్తకాలు సృష్టించుకుని భూములు ఆక్రమించుకున్నారని గతంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో భూములను పరిశీలించేందుకు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. దళారులను నమ్మవద్దని రైతులకు సూచించారు. భూ సమస్యపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.




రేమిడిచర్ల గ్రామంలో భూములను సందర్శించి, రికార్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ

2.54 లక్షల కుటుంబాలకు లబ్ధి

నాదెండ్ల: కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన వ్యవసాయ అవసరాలు అందుబాటులో ఉంచుతున్నట్లు పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఇంగిరాల మురళి చెప్పారు. మండలంలోని తూబాడు సొసైటీ కార్యాలయంలో గురువారం ప్రధాని మోదీ రాజస్థాన్ రాష్ట్రంలో కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ప్రారంభించటంతో, ఆ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పద్నాలుగో విడత కిసాన్ సమృద్ధి నిధులు రైతులకు జమ చేసినట్లు చెప్పారు.రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్

నరసరావుపేట టౌన్: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. ఆశీర్వాదం పాల్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అంశానికి సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను వివరించారు. ఎటువంటి లైగింక వేధింపులు ఎదురైనా వాటి నుంచి రక్షణ పొందడానికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దిశ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాద సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

జడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: జగనన్న సురక్ష శిబిరాల ద్వారా గ్రామాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారమవుతాయని జడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం–2 పరిధిలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతంలో సంక్షేమ పథకాలు రావాలంటే సిఫార్సులతో లంచాలు సమర్పించుకోవలసి వచ్చేదని, ఇప్పుడు గ్రామ వలంటీర్లు మీ ఇంటివచ్చి, మీకు అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలను మంజూరు చేయించి నేరుగా మీ బ్యాంకు ఖాతాలకు జమచేయిస్తున్నారని చెప్పారు. సాంకేతిక లోపాలవల్లగాని, కావలసిన ఏదేని ధ్రువపత్రం సమర్పించకపోవడం చేతనైతేనేమి అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందకపోతే జగనన్న సురక్షద్వారా మంజూరు చేయించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. 252మందికి కులము, ఆదాయం, కుటుంబ సభ్యుల, కౌలుదారు కార్డు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఇద్దరి నూతన రేషన్‌కార్డు ఇచ్చారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులు పొలంగట్లపై, పత్తిపంటలో అంతర్‌పంటగా వేసుకునేందుకు ఉచితంగా ఎకరాకు 4 కిలోలు చొప్పున కందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ సీహెచ్ పద్మాదేవి, ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచి కంబాల వీరబాబు, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, మాజీ అధ్యక్షుడు రామిశెట్టి చిన్న యల్లమందయ్య, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, జిల్లా పార్టీ కార్యదర్శి సుంకర శ్రీనివాసరెడ్డి, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కందులవారి పాలెం, బృగుబండలో...

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సత్వరమేలు జరుగుతుందని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాంకేతిక, ఇతర కారణాలవల్ల అర్హులు ఎవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుందన్నారు. లబ్ధిదారులకు 176 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ బూతుకూరి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బూతుకూరి వెంకటరెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బృగుబండ గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం లో తహసీల్దార్ ఎస్.సురేష్ పాల్గొని 259 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ గందు పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు అన్నదాసు శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీపీ



కందులవారిపాలెంలో సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ, సర్పంచ్

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై స్వల్ప వివాదం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో భారతరాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై గురువారం స్వల్ప వివాదం నెలకొంది. గ్రామంలోని పాలకేంద్రం వద్ద ఉన్న మురుగుకాల్వపైన ఎటువంటి అనుమతులు లేకుండా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని టీడీపీకి చెందిన ఎస్సీ కాలనీకి చెందిన వ్యక్తి సిమెంట్ పనులు చేపట్టాడు. గమనించిన స్థానికులు మురుగుకాల్వపైన విగ్రహం ఎలా ఏర్పాటు చేస్తారంటూ అతనితో వాదనకు దిగారు. ఆ ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు చేస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందితో పాటుగా, వర్షాకాలం రోడ్డు పై ఉన్న బురదమట్టి విగ్రహం పై పడే అవకాశం ఉంటుందని, వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల సమీపంలోని కమ్యూనిటీ ప్రదేశంలో విగ్రహం ఏర్పాటు చేస్తే తమవంతుగా సాయం అందిస్తామని అతనితో చెప్పినా వినిపించుకోకుండా స్థానికులతో వాదనకు దిగాడు. గ్రామపెద్దలు నచ్చచెప్పటంతో వివాదం సద్దుమణిగింది. సంఘటనా స్థలాన్ని సత్తెనపల్లి రూరల్ సీఐ సీహెచ్ కోటేశ్వరరావు పరిశీలించారు. మురుగుకాల్వపై విగ్రహం ఏర్పాటు సరైన నిర్ణయం కాదని, పైగా విద్యుత్ వైర్లు ఉన్నాయని కాలనీవాసులకు సూచించారు.

ఎంఈఓ జ్యోతికిరణ్‌కు ఘనసన్మానం

నకరికల్లు: మండల విద్యాశాఖాధికారిగా జ్యోతికిరణ్ సేవలు తమకు ఆదర్శనీయమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వహించి గుంటూరుకు బదిలీపై వెళ్తున్న ఎంఈఓ కె.జ్యోతికిరణ్‌ను మండలంలోని ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. దుశ్శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ అందరికీ అందుబాటులో ఉంటూ తన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, ప్రధానోపాధ్యాయులు కె.రంగాదేవి, టి.నగేష్, మేరీరాణి, ఎం.స్వామి, లోకానందం, వీరాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఎంఈఓ కె.జ్యోతికిరణ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అందరికీ విద్య లక్ష్యంతో నూతన విద్యావిధానం

జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ నరసింహా రావు

నాదెండ్ల: కేంద్ర ప్రభుత్వం అందరికీ విద్య అన్న లక్ష్యంతో 2020లో జాతీయ విద్యా విధానం తీసుకొచ్చిందని మద్దిరాల జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ నరసింహా రావు చెప్పారు. గణపవరం కేంద్రీయ విద్యాలయంలో (ఇర్లపాడు) గురువారం నూతన విద్యా విధానం ప్రవేశపెట్టి మూడేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడిఈడు పిల్లలు అందరూ తప్పకుండా పాఠశాలలకు హాజరై విద్యావంతులయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. మాతృభాషలో నాణ్యమైన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడంతో ఎంతో మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరిందన్నారు. ప్రపంచ దేశాల్లో పోటీని ఎదుర్కొనేలా భారతదేశ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నూతన విద్యా విధానం ఉపకరిస్తుందన్నారు. కేంద్రియ విద్యాలయంలో ఎన్‌ఈపీ 2020 అమలు ఉద్దేశం బాలవాటిక అమలు, వాటి వివరణ, విద్యా ప్రదేశ్ ఎఫ్‌ఎల్‌ఎస్, విద్యా నిపుణ్ వంటి కార్యక్రమాలపై కేంద్రియ విద్యాలయంలో అమలు, విద్యాంజలి వంటి పోర్టల్‌కు అధ్యాపకుల సహకారం, నిపుణ్ భారత్ వంటి కార్యక్రమాలపై ప్రసంగించారు.

అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సునీతసింగ్, అధ్యాపకులు అవినాష్, రామకిషన్, దివ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహా రావు, ఉపాధ్యాయులు

నేడు శివలీల విలాపం ప్రవచనం

నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు బ్రహ్మానంద సరస్వతిచే శివలీల విలాపం ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ గొలమూరి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రవచన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.